# ఊరి చెరువులు ప్రాజెక్టు కింద చెరువుల అభివృద్ధి

### -డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంభాషా



జైనబ్బీ దర్గావద్ద గల చెరువును పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంభాషా

**ఉరవకొండ, డిసెంబరు 17 ప్రభాతవార్త**

ప్రభుత్వం నూతనంగా చేపట్టనున్న ఊరి చెరువులు ప్రాజెక్టు కింద గ్రామాల్లోని చెరువులను అభివృద్ధి చేయడం జరుగుతుందని డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంభాషా తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని



బూదగవిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్

బీబీ జైనబ్బీ దర్గా పక్కనగల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు విస్తీర్ణం, ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలి అన్న విషయాలపై ఎంపీడీవో రవిప్రసాద్, డిపూ ్యటీ ఎంపీడీవో సతీష్‌బాబు, ఉపాధిహామీ ఏపీవో సుజాతతో చర్చించారు. సమగ్ర వివరాలు పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. కాగా ఎంపీడీవో రవిప్రసాద్ మండల పరిధిలోని బూదగవి గ్రామంలో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. రోజూ ఎంతమంది పనులకు వస్తున్నారు, గ్రామంలో ఏఏ పనులు జరుగుతున్నాయో తెలుసుకున్నారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# దేవాంగ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

### -ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన సంఘం బాధ్యులు



దేవాంగ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

**ఉరవకొండ, డిసెంబరు 17 ప్రభాతవార్త**

దేవాంగ సంక్షేమసంఘం 2026 నూతనసంవత్సరక్యాలెండర్‌ను సంఘం బాధ్యులు బుధవారం ఆవిష్కరించారు. పట్టణంలోని రామలింగ చౌడేశ్వరి దేవాంగ కళ్యాణ మండపంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సంఘం బాధ్యులు క్యాలెండర్‌నుఆవిష్కరించి ప్రజలకు నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో సంవృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగాపండి ప్రజలందరూ సుభిక్షంగాఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కటికం మల్లేష్, ఉపాధ్యక్షుడు రెడ్డి నాగరాజు, ప్రధాన కార్యదర్శి దోనపర్తి ప్రతాప్, సహాయ కార్యదర్శి నిమ్మలప్రసాద్, గౌరవాధ్యక్షులు కొమ్మసాని బాలచంద్ర, మిడతల విశ్వనాథ్, మిడతల నాగభూషణం, కార్యవర్గసభ్యులు రెడ్డిఆంజనేయులు, ఆర్.సి. ప్రసాద్, కొత్తజయనరసింహ ప్రసాద్, ఉట్టినాగరాజు, ఉట్టి నారాయణ స్వామి, చంగలచలపతి, చిట్టా రఘు, పూస సూరి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీబుగ్గ సంగమేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.1.87 లక్షలు



**గుంతకల్లు, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

మండల పరిధిలోని శ్రీబుగ్గ సంగమేశ్వరస్వామి దేవాలయ హుండీ లెక్కింపు బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించారు. స్వామివారికి భక్తులు సమర్పించిన 9 నెలల కానుకలు 1.87 లక్షలు, అన్నదాన హుండీ ద్వారా 11 వేల రూపాయలు సమకూరాయి. ఉండబండ ఆలయ అధికారి కే.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో పకడ్బందీగా హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కృష్ణయ్య, పాలకమండలి చైర్మన్ ఈశ్వరయ్య, సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామీణ బ్యాంక్ మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

# వైఎస్సార్‌సీపీ చిన్నముష్టూరు బీసీ, రైతు విభాగాలకు నూతన కమిటీలు

### -నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాలతో ఏర్పాటు



చిన్నముష్టూరు గ్రామ బీసీ, రైతు విభాగం కమిటీల బాధ్యులు

**ఉరవకొండ, డిసెంబరు 17 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామ వైఎస్సార్‌సీపీ బీసీ, రైతు విభాగాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. పార్టీను గ్రామస్థాయి నుండి మరింత బలోపేతం చేయడంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం రాయలసీమ జోన్ వర్కింగ్ ప్రసిడెంట్ వై.ప్రణయ్‌రెడ్డి ఆదేశాలతో బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గ్రామానికి చెందిన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ విభాగం అధ్యక్షులుగా గార్ల చిన్నమల్లప్ప, ప్రధాన కార్యదర్శులు బోయ శ్రీనివాసులు, బొమ్మప్పగారి ఓబుళపతి, బి.నాగరాజు, బోయ చిన్నమల్లప్ప, కార్యదర్శులుగా బోయ రాము, గార్ల ఓబులేసు, బోయ లింగన్న, బోయ రామక్రిష్ణలు ఎన్నికయ్యారు. రైతు విభాగం అధ్యక్షులుగా ఎం.సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శులుగా టి.ఓబులేసు, బోయ శివప్ప, బానాల సురేష్, బోయ చిన్నమల్లి, కార్యదర్శులుగా బోయ హరిక్రిష్ణ, బోయ నారాయణస్వామి, బోయ బోయ నరసింహులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు మాసినేని నరేష్, రాష్ట్ర బూత్ కమిటీ మఠం వీరేష్, మాజీ ఎంపీటీసీ లాలుస్వామి, నాయకులు బోయ మల్లికార్జున, రామన్న, చంద్రశేఖర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# నానో డీఏపీ, యూరియాపై రైతులకు అవగాహన కల్పించండి

### -శిక్షణా కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి యు.ఉమామహేశ్వరమ్మ

### -హాజరైన ఏపీఎంఐపీ పీడీ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి యు.ఉమామహేశ్వరమ్మ

**ఉరవకొండ, డిసెంబరు 17 ప్రభాతవార్త**




మాట్లాడుతున్న ఉరవకొండ ఏడీఏ ఎస్.సత్యనారాయణ

నానో డీఏపీ, యూరియాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయశాఖ, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకంలో ఆధునిక యాజమాన్య పద్ధతులపై ఉరవకొండ డివిజన్‌లోని క్షేత్రస్థాయి సిబ్బంది శిక్షణా కార్యక్రమం ఉరవకొండ ఏడీఏ ఎస్.సత్యనారాయణ అధ్యక్షతన జరుగగా ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చిన్నరాయుడు, మల్లికార్జున, యుగంధర్, డీఆర్‌సీ వ్యవసాయాధికారి లక్ష్మీనరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి యు.ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు పకడ్బందీగా జరుగాలని ఆదేశించారు. వరి, కంది, మొక్కజొన్న పంటపూత ప్రయోగాలను పూర్తి చేయాలన్నారు. ఆయా పంటల్లో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ళు, చీడపీడల నివారణ గుర్చి వివరిస్తూ నివారణ చర్యలను వివరించారు. శాస్త్రవేత్తలు చిన్నరాయుడు, మల్లికార్జున, యుగంధర్ మాట్లాడుతూ పప్పుశెనగ, కంది, మొక్కజొన్న, మిరప, వరి పంటల్లో చీడపీడలు, తెగుళ్ల నివారణ గుర్చి వివరించారు. ఎన్‌బీఈజీ-1267 అనే పప్పుశెనగ విత్తనం వేరుకుళ్ళు తెగులు, ఎండు తెగులును తట్టుకుంటుందని, అధిక దిగుబడులు ఇస్తుందన్నారు. ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీతో డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను అందిస్తోందని అవసరమైన వివరాలను రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు రామకృష్ణుడు, పెన్నయ్య, ఎంపీఈవోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ కిడ్నీ మార్పిడికి రూ.2.50 లక్షల ఆర్థిక సాయం




కానిస్టేబుల్ తండ్రికి నగదు అందజేస్తున్న డిఎస్‌పి శ్రీనివాస్

**గుంతకల్లు, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

కానిస్టేబుల్ ఉప్పర రమేష్ కిడ్నీ మార్పిడికి గుంతకల్లు సబ్ డివిజన్ పోలీసుసిబ్బంది 2.50 లక్షలరూపాయల ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. బుధవారం స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో డిఎస్‌పి శ్రీనివాస్ చేతులమీదుగా కానిస్టేబుల్ తండ్రికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడి కుటుంబ సభ్యులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామానికి చెందిన రమేష్ అనంతపురంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్, కసాపురం ఎస్ఐ టీపీ వెంకటస్వామి, హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు జిల్లా స్థాయికి ఎంపిక




ట్రోఫీ అందుకుంటున్న ఉపాధ్యాయుల జట్టు

**గుంతకల్లు, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు జిల్లా స్థాయికి ఎంపికైంది. బుధవారం శ్రీశంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో జరిగిన పోటీలో వజ్రకరూరు జట్టుపై 15 పరుగులతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గుంతకల్లు ఉపాధ్యాయుల జట్టు 15 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన వజ్రకరూరు జట్టు 9 వికెట్లు కోల్పోయి 105 పరుగులకే పరిమితమైంది. ఇదిలా ఉండగా జోనల్ స్థాయిలో జరుగుతున్న పోటీల్లో 10 మండలాల జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో డివిజనల్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, మండల విద్యాధికారి సుబ్బరాయుడు, జట్టు సభ్యులు వరప్రసాద్, రమేష్, రామాంజనేయులు, రఫీ, మోహన్‌రాజ్, శంకరయ్య, చంద్రారావు, చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

**గుత్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త**




పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలో ని రాష్ట్ర పెన్షనర్ల కార్యాలయంలో బుధవారం జాతీయ పెన్షనర్ల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్‌టిఓ సురేష్ బాబు, రిటైర్డ్ డాక్టర్లు కృష్ణ గోపాల్‌రెడ్డి, రంగన్నలు నకార చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం 70 సంవత్సరాలు దాటిన పెన్షనర్లు రామమోహన్, హసన్‌అహ్మద్, విజయభాస్కర్‌రెడ్డి, శ్యాం నతానియల్, రాజేందర్‌ప్రసాద్, ఆదినారాయణ, లక్ష్మీలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అబూబకర్, కోశాధికారి కుళ్లాయిబాబు, ఉపాధ్యక్షులు స్వర్ణాంబ, విజయలక్ష్మి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రబి పంటలపై శిక్షణ




జెడిఎ మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

రబి సీజన్‌లో వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు సిబ్బంది భూసార పరీక్షలు, పంటల పోషక నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గుత్తి వ్యవసాయ సబ్ డివిజన్ రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమెతో పాటు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ శశికళ, తదితరులు మాట్లాడుతూ వేరుశనగ విత్తన రకాలు, వాటి దిగుబడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్‌రెడ్డి, ఏడిఏ వెంకటరాముడు, వ్యవసాయశాఖ అధికారులు ముస్తాక్‌అహ్మద్, మహబూబ్‌బాషా, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉరవకొండలో జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల ర్యాలీ

### -ఇందనం పొదుపు చేసి భావితరాలకు వెలుగునిద్దామని పిలుపు

**ఉరవకొండ, డిసెంబరు 17 ప్రభాతవార్త**

పట్టణంలో బుధవారం విద్యుత్‌శాఖఆధ్వర్యంలో జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక విద్యుత్ కార్యాలయం నుండి అధికారులు, సిబ్బంది బ్యానర్, ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ పట్టణ ప్రధాన వీధి గుండా క్లాక్‌టవర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలు ఈనెల 14 నుండి 20 వరకు జరుగుతున్నాయన్నారు. ఇందన పొదుపును మహోద్యమంగా ముందుకు తీసుకెళ్లి భావి తరాలకు వెలుగునిద్దాం అన్న నినాదంతో వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈఈ సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల ర్యాలీ దృశ్యం

# శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ ఐ గురు ప్రసాద్ రెడ్డి

**డి.హిరెహాళ్ డిసెంబరు 17 ప్రభాతవార్త**

గ్రామంలో శాంతిభద్రతల కు విఘాతం కల్పిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం రాత్రి డి. హిరెహాళ్ మండలం పూలకుర్తి గ్రామంలో తన సిబ్బందితో కలిసి



ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజలను ఈశ్వరాలయంలో సమావేశపరచి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు చట్టాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకొని తమ జీవన శైలిని మార్చుకుంటూ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఎస్.ఐ. పేర్కొన్నారు. సివిల్ రైట్స్ పై అవగాహన సదస్సు నిర్వహించి చట్టాలు, పౌర హక్కులు తదితర అంశాలపై వివరించారు. ఈ అవగాహన సదస్సులో రోడ్డు ప్రమాదాలు, ఫోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు తో చోటుచేసుకుని అనర్థాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు తదితర చట్టాల గురించి వివరించారు. చట్టాలను ఉల్లంఘించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం లాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు బాల బాలికలన్న తేడా చూపకుండా అందరికీ విద్యా నేర్పించాల్సిన అవసరం ఉందని మీ పిల్లలను విధిగా పాఠశాలలకు పంపాలని ఎస్సై తెలిపారు. మీ పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి అత్యున్నత స్థాయి అధిరోహిస్తే అది దేశాభివృద్ధికి దోహదపడుతుందని మీ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎస్.ఐ. తెలిపారు. విద్యతోనే చట్టాలు, హక్కులను సులువుగా తెలుసుకుని తమ జీవితాలను చక్కగా మలుసుకుంటారని ఆ అవకాశం కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్న ఈ విషయాలు తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని ఎస్.ఐ. సూచించారు.

# గోరంట్ల, బూదిలి హైస్కూల్ ల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్

### మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి చేతులు మీదుగా అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

**గోరంట్ల డిసెంబర్ 17 ప్రభాతవార్త**

గోరంట్ల పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాల యందు గోరంట్ల మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి ఔదార్యంతో రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు దృష్టిలోఉంచుకొని తక్కువ సమయం ఉంది కావున అన్ని సబ్జెక్టులు కలిపి ఒక స్మార్ట్ బుక్ తయారు చేశారు ఈ పుస్తకం చదివి పిల్లలు మంచి మార్కులు సాధించాలని ఉపాధ్యాయ సంఘాల సూచన మేరకు గోరంట్ల బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలతి అధ్యక్షతన నిమ్మల విద్యాధరణి పిల్లలకు పుస్తకాలు అందజేయడం జరిగింది. తదనంతరం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అందరూ కలిసి శ్రీమతి నిమ్మల వ విద్యాధరణి ని ఘనంగా సన్మానించారు. అలాగే మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారిని పలకరించి పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం రుచిగా చేసి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మురళి, కిష్టప్ప, చాంద్ భాషా, నగేష్ రామాంజనేయులు తెలుగుదేశం పార్టీ నాయకులు షామీర్ భాష, వృషభ దేవుడు, దేవాంగం నరేష్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐ సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ హర్షలత

**కళ్యాణ్ దుర్గం టౌన్, డిసెంబర్ 17, ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీలకు జనరేటివ్ ఏఐ సర్టిఫికెట్ కోర్స్‌ను బుధవారం ప్రారంభించారు. విద్యార్థినీలు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి పీఎం ఉష, ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షణ అభియాన్ ఉన్నత విద్యా పథకం కార్యక్రమంలో భాగంగా



ఏఐ శిక్ష తరగతికి హాజరైన విద్యార్థినీలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై ఎక్సెల్ ఆర్ సంస్థ సర్టిఫికెట్ కోర్సును డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ హర్షలత మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో ఏఐ పైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకోవచ్చని తెలిపారు. కావున విద్యార్థులను ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ సూర్య నాగిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీధర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# యూనిఫైడ్ ఫ్యామిలీసర్వేపై శిక్షణ

**రామగిరి, డిసెంబర్ 17 ప్రభాతవార్త :** మండలంలోని సచివాలయ సిబ్బందికి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం రామగిరి ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేందుకు ఈసర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపిడిఓ గంగావతి, డిప్యూటీ ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహశీల్దారు శంకరశిక్షణ ఇచ్చారు. ఈ సర్వేలో ఆధార్, వ్యక్తిగత వివరాలు, కుటుంబ వివరాలు, విద్య, వైద్యం, ఉపాధి, ఆదాయం, ఇళ్లు, ఆస్తులు, వాహనాలు తదితర వివరాలు సమగ్ర సమాచారం అఫిషియల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ వివరాలు తప్పుగాఆ ఇస్తే భవిష్యత్తులో మీకు ఇబ్బందిగా ఉంటుందని తెలియజేయాలన్నారు.

# ఉరవకొండలో ఘనంగా విశ్రాంత ఉద్యోగుల జాతీయ దినోత్సవం

### - హాజరైన సబ్ ట్రెజరీ అధికారి నాగేంద్రబాబు, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సుధాకర్ - 70 సంవత్సరాలు వయసు నిండిన విశ్రాంత ఉద్యోగులకు ఘన సన్మానం - 2026 నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించిన ముఖ్య అతిధులు



పెన్షనర్ల దినోత్సవంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిధులు సబ్ ట్రెజరీ అధికారి డి.నాగేంద్రబాబు, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ కె.సుధాకర్ తదితరులు




సభలో మాట్లాడుతున్న సబ్ ట్రెజరీ అధికారి డి.నాగేంద్రబాబు

**ఉరవకొండ, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ వెనుకగల ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనం ఆవరణంలో బుధవారం విశ్రాంత ఉద్యోగుల జాతీయ దినోత్సవం, సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది. తాలుకా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.క్రిష్టప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఉరవకొండ సబ్ ట్రెజరీ అధికారి డి.నాగేంద్రబాబు, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ కె.సుధాకర్, బజార్ బ్రాంచి మేనేజర్ డి.షాజహాన్‌బాబు, ఏపీ ఎన్‌జీజీవో సంఘం అధ్యక్షులు ఎం.భాస్కర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జి.గురుప్రసాద్, ఉపాధ్యాయ సంఘం మాజీ నేత నాగేంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత డి.ఎస్.నకర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం విశ్రాంత ఉద్యోగుల పతాకాన్ని అధ్యక్షులు కె.క్రిష్టప్ప ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో సంఘం వార్షిక ఆర్థిక నివేదికపై చర్చ జరుగగా కార్యదర్శి ఎన్.వెంకటస్వామి వార్షిక నివేదిక, కోశాధికారి ఎన్.నారాయణ ఆర్థిక నివేదిక సమర్పించారు. గడిచిన సంవత్సర కాలంలో మరణించిన పెన్షనర్ల ఆత్మశాంతికై రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సంఘం 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. సభలో వక్తలు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఐకమత్యంతో ఉండి హక్కులను సాధించుకొంటూ ఎందరిలోనో స్ఫూర్తిని నింపుతున్నారన్నారు. ఉరవకొండ అసోసియేషన్ రాష్ట్రంలోనే ఉత్తమ అసోసియేషన్‌గా పేరు సంపాధించిందన్నారు. విశ్రాంత ఉద్యోగులకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

### 70 సంవత్సరాల వయస్సు నిండిన విశ్రాంత ఉద్యోగులకు సన్మానం:

కాగా 70 సంవత్సరాల వయసు నిండిన విశ్రాంత ఉద్యోగులు జి.దత్తాత్రేయులు, యస్.ఓబుళానాయక్, యం.రామాంజినమ్మ, పి.అబ్దుల్ రహిమాన్, బి.రుద్రప్ప, అన్సర్ షరీఫా బేగం, యం.నజీర్ అహ్మద్, కె.వెంకటేశ్వర్లు, కె.బసమ్మ, పి.నబిసాహెబ్, వి.నారాయణప్ప, యు.శాంతమ్మ, యం.మారెమ్మను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

## విశ్రాంత ఉద్యోగుల సేవలు అమూల్యమైనవి

ధర్మవరంటౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త



విశ్రాతం ఉద్యోగులను సన్మానిస్తున్న హరీశ్ బాబు

విశ్రాంత ఉద్యోగుల సేవలు అమూల్యమైనవి నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశ్ బాబు తెలిపారు. ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం ధర్మవరంశాఖ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్జీఓ హోంలో సీనియర్ విశ్రాంత ఉద్యోగులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జి హరీశ్ బాబు హాజరై మాట్లాడుతూ...ప్రభుత్వ వ్యవస్థ బలోపేతానికి విశ్రాంత ఉద్యోగులు చేసిన సేవలు అమూల్యమైనవన్నారు. ఉద్యోగ విరమణ అనంతర కూడా సమాజానికి దిశా నిర్దేశం చేసి అనుభవం, విజ్ఞానం విశ్రాంత ఉద్యోగులకే సొంతమన్నారు. యువతకు వారు ఆదర్శప్రాయులని, వారి సూచనలు, సలహాలు, సమాజానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. సుదీర్ఘకాలం ప్రభుత్వ సేవలో నిబద్ధతతో పనిచేసి ప్రజలకు సేవలందించిన విశ్రాంత ఉద్యోగులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. భవిష్యత్తులో కూడా విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులసంఘం తాలూకా అధ్యక్షుడు ఏకిల చలపతి, తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణకు కొత్త ట్రాక్టర్

రామగిరి, డిసెంబర్ 17 ప్రభాతవార్త



ట్రాక్టర్‌ను అందజేస్తున్న దృశ్యం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నేత రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మ సహకారంతో రామగిరి మండలం కుంటిమద్ది సచివాలయానికి చెత్తన సేకరించడానికి కొత్త ట్రాక్టర్ ట్రాలీకి పూజ చేసి చెత్త సేకరించడానికి ఉపయోగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీ చంద్రకాంత్ మండల నాయకులు మారుతి ప్రసాద్ సుద్దకుంటపల్లి కేశవ స్టోర్ డీలర్లు రఘురాములు ఆనంద్ బూత్ కన్వీనర్ నరేష్, సచివాలయ సిబ్బంది చెత్తను సేకరించి పాల్గొనడం జరిగింది.

## సీనియర్ తెలుగుదేశం నాయకుడు మృతి

అగళి, డిసెంబర్ 17 ప్రభాతవార్త



మృతునికి నివాళులు అర్పిస్తున్న జడ్పిటిసి

మండల కేంద్రమైన అగళికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వాటర్ మెన్ అంజినప్ప (70) అనారోగ్యంతో మృతి చెందారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న జడ్పిటిసి ఉమేష్, మృతుని భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి జడ్పిటిసి ఉమేష్ ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంజినప్ప మృతి పార్టీకి తీరని లోటు అన్నారు.

## గొర్రెల మంద పై దూసుకెళ్లిన ఐచర్

వజ్రకరూర్ డిసెంబర్ 17 ప్రభాతవార్త



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పోలీసులు, వివిధ పార్టీల నాయకులు

గొర్రెల మందపై నుండి ఐచర్ వాహనం దూసుకెల్లడంతో 23 గొర్రెలు మృతి చెంది మరో 29 గొర్రెల పరిస్థితి విషమంగా ఉన్న ఘటన బుధవారం గుంటకల్ ఉరువకొండ ప్రధాన రహదారిలోని కమలపాడు అడ్డరస్తా సమీపంలో చోటుచేసుకుంది. బాధితులు రాము, హేమంత్ , మహేష్ సుధాకర్ లు తెలిపిన వివరాల ప్రకారం... తెల్లవారుజామున సుమారు2 గంటల ప్రాంతంలో పులగుట్టపల్లి గ్రామం నుండి తట్రకల్లు గ్రామానికి గొర్రెలను మేత కోసం తీసుకువస్తుండగా ఉరవకొండ నుండి గుంటకల్లుకు వెళ్తున్న ఐచర్ వాహనం మందపై దూసుకు వెళ్లిందన్నారు. దీంతో అక్కడికక్కడే 23 గొర్రెలు మృత్యువాత పడగా మరో 29 గొర్రెల పరిస్థితి విషమంగా ఉందన్నారు. వెంటనే విషయాని వజ్రకరూరు పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించారు. పోలీస్ స్టేషన్ వాహనాన్ని అప్పగించారు. పోలీసులు పశువైద్య శాఖ అధికారులు వివిధ పార్టీల నాయకులు ఘటనస్థలానికి వెళ్లి పరిశీలించారు. గాయపడిన గొర్రెలకు పశువైద్య సిబ్బంది వైద్యం అందించారు. ఐదు లక్షలకు పైగా నష్టం వాటిలినట్లు బాధితులు వాపోయారు.

## విద్యార్థుల్లో వ్యాపార రంగంపై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన దృశ్యం

అమరాపురం డిసెంబర్ 17 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎం జే ఎం పాఠశాల విద్యార్థులకు వ్యాపార రంగంపై అవగాహన సదస్సును పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ వనమాల ప్రశాంత్ కుమార్ జైన్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రిన్సిపాల్ సల్మాన్ షాజీ నేతృత్వంలో బుధవారం ఏర్పాటు చేశారు. అమరాపురం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో పాఠశాల యాజమాన్యం ఏర్పాటుచేసిన ప్రత్యేకత స్టాల్ వద్ద విద్యార్థులు తమ సొంత ఖర్చులతో వివిధ వస్తువులను మరియు తినుబండారాలను, విద్యార్థులకు కావలసిన వస్తువులను తీసుకుని వచ్చి విచ్చేసిన ప్రజలకు మరియు విద్యార్థులకు అమ్మకాలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యాపారంలో మెలకువలు మరియు కొనుగోలుకు వచ్చే వ్యక్తుల వద్ద ఎలా ప్రవర్తించాలి అనే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కస్పాండెంట్ వనమాల ప్రశాంత్ కుమార్ జైన్ తెలిపారు. పాఠశాలలోని నాలుగవ తరగతి నుండి ఏడవ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సన్మతి కుమార్ జైన్, అమిత్ కుమార్ జైన్, సిద్దేశ్వర మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## 22 నుంచి మండలంలో స్వమిత్వ గ్రామ సభలు

-మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్

ఉరవకొండ, డిసెంబరు 17 ప్రభాతవార్త

ఈనెల 22వ తేదీ నుంచి మండలంలో స్వమిత్వ గ్రామ సభలు జరుగుతాయని ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.సతీష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న వెలిగొండ, బూదగవి, 23న మోపిడి, రాయంపల్లి, 24న రేణిమాకులపల్లి, నింబగల్లు, 26న నెరిమెట్ల, చిన్నముష్టూరు, 27న వ్యాసాపురం, 29న లత్తవరం, షేక్షానుపల్లి గ్రామాల్లో కొనసాగుతాయన్నారు. గ్రామసభల్లో 9(2) నోటీసులను, పీపీఎంలను ప్రాపర్టీ యజమానులకు అందించడం జరుగుతుందన్నారు. ఈక్రమంలోనే అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని వారు వివరించారు.

## జిల్లాలో క్యాన్సర్ సర్విక్స్ నివారణకు హెచ్‌పివి టీకాపై శిక్షణా కార్యక్రమం

శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) డిసెంబర్ 17 ప్రభాతవార్త:



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ, శిక్షణకు హాజరైన వైద్య అధికారులు



మహిళల్లో పెరుగుతున్న క్యాన్సర్ సర్విక్స్ వ్యాధిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన నూతన "హ్యూమన్ ప్యాపిలోమా వైరస్ " టీకా అమలును శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రారంభించేందుకు సన్నాహాలు పూర్తి చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని పుట్టపర్తిలో నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. ఫైరోజా బేగం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో వచ్చే రోజుల్లో అమలుకానున్న టీకా విధానం, నమోదుప్రక్రియ, ప్రయోజనాలపై పూర్తిఅవగాహన కల్పించారు. మొదటిదశలో జిల్లాలోని సుమారు 20,000మంది 14ఏళ్ల కౌమార బాలికలనుగుర్తించి టీకావేయడానికి ప్రత్యేకప్రణాళిక రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం 8 ఏళ్లు పైబడిన బాలికలు, మహిళలు సర్వజన టీకాల కార్యక్రమంద్వారా ఈహెచ్‌పివిటీకాను పొందవచ్చని తెలియజేశారు. మహిళల ఆరోగ్యాన్ని హరించే క్యాన్సర్ సర్విక్స్ వ్యాధి నిర్మూలన దిశగా ఈ టీకా ఒక కీలకమైన అడుగు అవుతుందని వైద్య శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచి, ప్రతి అర్హూలు ఈ టీకా తీసుకునేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ కే. సురేష్ బాబు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ మధుసూదన్, జిల్లా ఉపవైద్యాధికారులు డాక్టర్ నాగేంద్ర నాయక్, డాక్టర్ సునీల్, జిల్లా కార్యాలయ ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

రొళ్ల డిసెంబర్17 ప్రభాతవార్త:



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

మండల పరిధిలోని దొమ్మరహట్టి సమీపంలో గల బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను బుధవారం ఎంఈఓ శ్రీధర్ తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఉపాధ్యాయుల హాజరు, సిలబస్, అసెస్మెంట్ వంట సరుకులు ,వంట గది శుభ్రత, టాయిలెట్ల నిర్వహణ, పాకెట్ మనీ వివరాలను పరిశీలించారు. అనంతరం కూరగాయలు పంపిణీ చేసే ఏజెన్సీకి ఫోన్ చేసి నాణ్యతతో కూడిన తాజా కూరగాయలు పంపిణీ చేయాలని ఆదేశించారు. కూరగాయలను నిల్వచేసే గదిని పరిశుభ్రముగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి చూశారు. వంట చేసే వారు బియ్యం ను కడిగిన తరువాత పరిశుభ్రంగా వండాలన్నారు. అన్నం గంజిలో పోషక విలువలు కలిగిన పదార్థాలు ఉంటాయినీ గంజిని పార వేయకుండదన్నారు. తల్లి దండ్రులు విద్యార్థులకు ఖర్చులకు ఇచ్చే పాకెట్ మనినీ విద్యార్థులకు ఇచ్చి వారే వినియోగించే విధంగా చూడాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు లీప్ యాప్ నందు వ్యక్తిగతంగా సెలవును పెట్టుకొని సెలవును మంజూరు చేయించుకోవాలనీ అలా కాకుండా ఎవరు కూడా అనుమతి లేకుండా అనధికారికంగా గైర్హాజరు కాకూడదన్నారు. అన్ని తరగతుల యందు అన్ని సబ్జెక్టుల యందు సిలబస్ ను సకాలంలో పూర్తి చేసి సిద్ధంగా ఉంచుకోవలనీ తెలిపారు. విద్యార్థుల యొక్క నోటు పుస్తకాలు ,పరీక్ష పేపర్లు మొదలైనవి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మైలారప్ప ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్చడం దుర్మార్గం

- ఎంపీడీవో కార్యాలయం ముందు సీపీఎం ధర్నా - జీవో కాపీలు దగ్ధం

గుంతకల్లు, డిసెంబర్ 17 ప్రభాతవార్త



జీవో కాపీలను దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం దుర్మార్గమని సీపీఎం నాయకులు మండిపడ్డారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని పేదలకు దూరం చేసేలా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయన్నారు. నూతనంగా తెస్తున్న అజీవిక్ మిషన్ గ్రామీణ పథకం పార్లమెంటులో ప్రవేశ పెట్టడం సరైంది కాదన్నారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు ఇస్తామనడం పేదలను మోసం చేయడమేనన్నారు. నూతన పథకం ద్వారా 100 రోజుల పనిని 125 రోజులకు పెంచుతామని మోసపూరిత మాటలు చెబుతున్నారన్నారు. ప్రస్తుతం 50 రోజులకు మించి పనులు కల్పించలేని పరిస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించాలంటే 200 రోజులు పనులు కల్పించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజుకు 600 రూపాయల చొప్పున వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో దేవదాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు జగ్గలి రమేష్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, సురేంద్రబాబు, వజ్రకరూరు మండల కార్యదర్శి విరుపాక్షి, పట్టణ కమిటీ సభ్యులు రాముమాయక్, సూరి, బాష, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 19న ఇంటర్మీడియట్ సిలబస్ సంస్కరణలపై అవగాహన సదస్సు

కొత్తచెరువు డిసెంబర్ 17 ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ విద్యా డైరెక్టర్ రంజిత్ భాష ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్ సిలబస్ మరియు పరీక్ష విధానంలో జరిగిన సంస్కరణలపై అవగాహన సదస్సును శ్రీ సత్య సాయి జిల్లా మంగళకర జూనియర్ కళాశాల నందు డిసెంబర్ 19వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించబడునని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి చెన్నకేశవ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలపారు ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్ బోర్డ్ పరీక్షల నిర్వహణ ప్రత్యేక అధికారి రమేష్ , కడప రీజియన్ జాయింట్ డైరెక్టర్ సురేష్ బాబు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లు, అధ్యాపకులు మరియు ఇంటర్ పరీక్షా కేంద్రాలు కలిగిన అన్ని కళాశాలల ప్రిన్సిపల్ లో హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

## రైల్వే డివిజన్లో ఏళ్ల తరబడి ఒకే చోట విదులా

గుంతకల్ రైల్వే, డిసెంబర్ 17 ప్రభాత వార్త




గుంతకల్ రైల్వే డివిజన్ లో కొంతమంది అధికారులు ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహించడం గమనార్హం. కొందరు అధికారులు పిల్లల చదువులంటూ, పదవి విరమణ పొందే కాలమంటూ, మరి కొందరు ఆరోగ్యసమస్యలు అంటూ భార్యలేదాభర్తసమీపంలో పనిచేస్తున్నాడని కారణం చూపి కొందరు ఉద్యోగులు హోదాను అడ్డం పెట్టుకుని ఉద్యోగ సంఘాల నాయకులం అంటూ మరికొందరు ఏళ్ల తరబడి ఒకే చోట పని చేస్తుండడం చూస్తుంటే కొందరు తప్పు పడుతున్నారు. ఏ కారణాలు చూపి మళ్లీ పోస్టింగ్లు తెచ్చుకున్న ఉద్యోగస్తులపై విచారణ చేయించి పోస్టింగులు వేయాలని అటువంటి వారిపై విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టాలని సాటి ఉద్యోగస్తులు భావిస్తున్నారు. గుంతకల్ డివిజన్లోని కొన్ని శాఖలు ఇంజనీరింగ్, బిల్స్, అకౌంట్స్, పర్సనల్ బ్రాంచ్, కమర్షియల్ , పార్సల్ , హాస్పిటల్, లాబీ, టి ఆర్ డి, లాంటి ఇలా ఎన్నో కీలకమైన శాఖలు పని చేయుచున్న వీరి తీరులో ఆయా స్థానాలకు రావలనుకుంటున్న ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతీస్తున్నాయని పేర్కొంటున్నారు. స్పౌజ్ కోటా కింద ఒకే చోట ఎన్నేళ్లు పనిచేయడానికి అవకాశం ఉంది ఉద్యోగ సంఘం నాయకులు ఏళ్ల తరబడి ఒకే చోట పని చేయవచ్చా చట్ట నిబంధనలు ఏం చెబుతున్నాయి అంటూ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఈ మొత్తం వివరాలు పై ఉన్నత అధికారులు లోతైన విచారణ చేపట్టాలని ఉద్యోగస్తులు కోరుకుంటున్నారు.

## గుత్తిలో మరో హోటల్ దగ్ధం

గుత్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త



గుత్తిలో మరో హోటల్ దగ్ధమైన దృశ్యం



సిఐకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలో 24 గంటలు గడవకమునుపే మరొక హోటల్ దగ్ధమైంది. స్థానిక గాంధీ చౌక్ సమీపంలో ఉన్న నీరజ అనే మహిళకు చెందిన హోటల్ బుధవారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న టిడిపి నాయకులు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనా బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా తగు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామని బాధితురాలికి హామీ ఇచ్చారు. కాగా కేవలం రెండు రోజుల వ్యవధిలోనే ఒకే ప్రాంతంలో రెండు చిరు వ్యాపారస్తుల హోటళ్లకు నిప్పు పెట్టడం పట్ల వైకాపా నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, సివి రంగారెడ్డి, గురుప్రసాద్, రంగస్వామి ఆధ్వర్యంలో సిఐ రామారావుకు వినతిపత్రం అందచేశారు. ఈ అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ముగిసిన ఉపాధ్యాయ క్రికెట్, త్రో బాల్ పోటీలు



ఉపాధ్యాయ క్రికెట్ పోటీ విజేతలు

పెనుకొండ డిసెంబర్ 17 (ప్రభాతవార్త)

డివిజన్‌లోని 12 మండలాల చెందిన ఉపాధ్యాయుల క్రికెట్ మరియు మహిళా ఉపాధ్యాయులు త్రో బాల్ పోటీలలో పాల్గొన్నారు. పురుషుల క్రికెట్ పోటీల ఫైనల్ లో రొద్దం, మడకశిర మండలాల జట్లు పోటీపడగా మడకశిర జట్టు ఫైనల్ లో విజయం సాధించింది నిర్ణీత 15 ఓవర్ల లో మడకశిర జట్టు 137 పరుగులు చేయగా, రొద్దం జట్టు 15 ఓవర్లలో 120 పరుగులు మాత్రమే చేయగలిగింది. మహిళల త్రోబాల్ పోటీల్లో పరిగి హిందూపురం జట్లు ఫైనల్లో తలపడగా పరిగి జట్టు విజయం సాధించింది. విజేతలకు పెనుకొండ డీవైయీఓ జాన్ రెడ్డప్ప ,ఎంఈఓ లు రాఘవయ్య, సుధాకర్ , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ లక్ష్మీ నారాయణ ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమం లో వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## పైప్ లైన్ పగిలి వృథాగా పోతున్న త్రాగునీరు

- గ్రామ కార్యదర్శికి, సర్పంచ్‌కి విన్నవించుకున్న పట్టించుకోని వైనం

- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన పంచాయతీ ప్రజలు



ఊరి మధ్యలో పారుతున్న కాలువ

చెన్నేకొత్తపల్లి, డిసెంబర్ 17 ప్రభాతవార్త

చెన్నై కొత్తపల్లి మండలం నాగసముద్రం పంచాయి యర్రజిన్నగారిపల్లి గ్రామంలోని నీటి పైపులైను పగిలి రహదారుల వెంట నీరు పారి అవి కాస్త మురికి నీరుగా మారి, గ్రామంలోని వీధుల వెంట పరుగులీడుతోంది. ఈ నీరు పారి పారి చివరకు మంచి నీటి కాలువ కాస్త మురికి నీరు కలుస్తూ మురికి కాలువగా తయారైంది. దీంతో యువత దాటుకుంటూ వెళ్తున్నారు, ఇకపోతే చిన్నారులు, ముసలివారు దాటలేక నడుస్తూ జారుతూ పడుతూ లేస్తూ వెళ్తున్నారు. అటుగా వెళ్లిన సమయంలో ఏ బండో చూడకుండా వస్తే జారడం పడటం ఇక్కడ శరా మామూలే అయిపోయింది. ఇదో సమస్యేనా అంటే కాదు ఇంకా ఉన్నాయి.. సిమెంట్ రోడ్లు లేక వర్షాకాల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది, అంతేనా అంటూ.. లేదండి ఇంకా ఉన్నాయి అన్నట్టు రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేని దుస్థితి కూడా ఉంది. అదే నీరు రోడ్లపైకి వదులుతూ ఊరు మొత్తం ఇదే పరిస్థితి నెలకొందంటే ఇదేందబ్బా అనుకుంటున్నారా అంతేనండి ఈ ఊరిలో అన్ని సమస్యలే.. మరి అధికారులు ఏం చేస్తున్నారు అని ప్రశ్నిస్తారేమో అధికారుల దృష్టికి, జిల్లా స్థాయి ప్రజా సమస్యల వేదికల దృష్టికి తీసుకెళ్లి.. తీసుకెళ్లి.. ఇక ఎవరు పట్టించుకోక పోవడంతో నీరసించినట్లు మిన్నకుండి పోయారు. మరి ఇప్పుడెందుకు బయటకి వచ్చిందంటారా ప్రభాతవార్త ప్రతినిధుల సలహాల మేరకు వెళ్లడం వల్ల ఊరు బాగుపడుతుందని ఎవరో చెబితే వారిని సంప్రదించి ఆ దారిలోనైనా పోయి మా ఊరిని బాగు చేసుకుందామనుకుంటున్నామని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. ఇకపోతే పంచాయతీ సెక్రటరీ ఫోన్ ద్వారా విషయం చెబితే సర్పంచ్‌గాని సెక్రెటరీ రెస్పాన్స్ కావడం లేదని బుధవారం ఈ విషయంపై ఎమ్మెల్యే పరిటాల సునీతకు తెలియజేయడం జరిగినదని పంచాయతీ ప్రజలు తెలియజేశారు. పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్‌ని గాని స్పందించి వెంటనే మా ఊరి సమస్యలను తీర్చే విధంగా చూడాలని ఎమ్మెల్యేని విన్నవించుకున్నారు.

## 10లో 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేయాలి

- వందరోజుల కార్యక్రమం అమలు స్పెషల్ ఆఫీసర్, మండల అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ



విద్యార్థులతో మాట్లాడుతున్న మండల అభివృద్ధి అధికారి లక్ష్మినారాయణ

బెలుగుప్ప, డిసెంబర్ 17 ప్రభాతవార్త

పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వందరోజుల ప్రణాళిక అమలులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బెళుగుప్పను మండల అభివృద్ధి అధికారి లక్ష్మినారాయణ, మండల విద్యాశాఖ అధికారి హరికృష్ణ సందర్శించడం జరిగినది. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి, పదవ తరగతి వందరోజుల కార్యక్రమం ప్రణాళిక స్పెషల్ ఆఫీసర్ లక్ష్మినారాయణ, పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ..వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో జరిగే అంశాల గురించి తెలుసుకొని పదవ తరగతి మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలని చెప్పడం జరిగింది. బెలుగుప్ప ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో తరగతి మొదటి స్థానం వచ్చిన విద్యార్థులకు 2000 ప్రోత్సాహక బహుమతిని ఇస్తానని హామీ ఇవ్వడం జరిగినది తర్వాత ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో 100 రోజుల కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నందుకు ఉపాధ్యాయులను అభినందిస్తూ.. కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత అయ్యేవిధంగా కృషి చేయాలని తెలియజేయడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ.. రౌండ్ పరీక్షలలో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉందని దాన్ని మెరుగుపరుచుకుని పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణ సాధించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## ఉపాధిహామీ పనులపై మొదలు కానున్న సామాజిక తనిఖీ

- 2024-25 మధ్య మండలంలో ఉపాధి పనులకు రూ.9.52 కోట్ల వ్యయం

- కూలీలకు రూ.4.79 కోట్లు, మెటీరియల్‌కు రూ.4.72 కోట్లు చెల్లింపులు




ఉపాధి హామీ పథకం ఉరవకొండ కార్యాలయం

ఉరవకొండ, డిసెంబరు 17 ప్రభాతవార్త

ఉరవకొండ మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరిగిన 9,52,66,678 రూపాయలు విలువైన పనులపై 18వ విడత సామాజిక తనిఖీ జరుగనుంది. ఇందుకోసం తనిఖీ బృందం స్టేట్ రిసోర్స్ పర్సన్ నీలకంఠ ఆధ్వర్యంలో ముగ్గురు డీఆర్‌పీలు, సిబ్బంది మండల పరిషత్ కార్యాలయం చేరుకోగా బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. మండలంలో 18 గ్రామ పంచాయతీ ఉండగా అందులో 1,289 పనులకు సంబంధించి కూలీలకు 4,79,90,997 రూపాయలు, మెటీరియల్‌కు 4,72,75,681 రూపాయలు ఖర్చు చేశారు. వెలిగొండలో 45,90,161 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 29,23,299 రూపాయలు, మెటీరియల్‌కు 16,66,862 రూపాయలు ఖర్చుచేశారు. పెద్దముష్టూరులో 32,33,221 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 26,31,135 రూపాయలు, మెటీరియల్‌కు 6,02,086 రూపాయలు ఖర్చు చేశారు. రాకెట్లలో 60,36,690 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 36,83,459 రూపాయలు, మెటీరియల్‌కు 23,53,231 రూపాయలు ఖర్చు చేశారు. రాయంపల్లిలో 23,06,209 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 16,04,799 రూపాయలు, మెటీరియల్‌కు 7,01,410 రూపాయలు ఖర్చు చేశారు. రేణుమాకుపల్లిలో 25,47,602 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 16,92,547 రూపాయలు, మెటీరియల్‌కు 8,55,055 రూపాయలు ఖర్చు చేశారు. వెలిగొండలో 25,86,940 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 11,51,461 రూపాయలు, మెటీరియల్‌కు 14,33,547 రూపాయలు ఖర్చుచేశారు. మోపిడిలో 49,22,897 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 36,00,624 రూపాయలు, మెటీరియల్‌కు 13,22,273 రూపాయలు ఖర్చు చేశారు. ఆమిద్యాలో 45,83,567 రూపాయలు విలువైనపనులు జరుగగాకూలీలకు 44,33,062 రూపాయలు, మెటీరియల్‌కు 1,50,505 రూపాయలు ఖర్చు పెట్టారు. ఇంద్రావతిలో 15,46,381 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 10,76,233 రూపాయలు, మెటీరియల్‌కు 4,70,148 రూపాయలు ఖర్చు చేశారు. లత్తవరం తండాలో 30,82,607 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 26,04,176 రూపాయలు, మెటీరియల్‌కు 4,78,431 రూపాయలు ఖర్చు చేశారు. నెరమెట్లలో 30,19,932 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 16,48,872 రూపాయలు, మెటీరియల్‌కు 13,71,060 రూపాయలు ఖర్చు చేశారు. నింబగల్లులో 27,68,513 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 14,08,510 రూపాయలు, మెటీరియల్‌కు 13,60,003 రూపాయలు ఖర్చు చేశారు. ఉరవకొండలో 1,86,72,301 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 61,84,402 రూపాయలు, మెటీరియల్‌కు 1,24,87,899 రూపాయలు ఖర్చు చేశారు. వ్యాసాపురంలో 20,58,845 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 12,06,756 రూపాయలు, మెటీరియల్‌కు 8,52,089 రూపాయలు ఖర్చు పెట్టారు. షేక్షానుపల్లిలో 59,75,807 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 44,40,515 రూపాయలు, మెటీరియల్‌కు 15,35,292 రూపాయలు ఖర్చు పెట్టారు. చిన్నముష్టూరులో 36,71,533 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 24,38,593 రూపాయలు, మెటీరియల్‌కు 12,32,940 రూపాయలు ఖర్చు చేశారు. పి.కౌకుంట్లలో 80,21,086 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 34,66,533 రూపాయలు, మెటీరియల్‌కు 45,54,553 రూపాయలు ఖర్చు పెట్టారు. బూదగవిలో 27,42,386 రూపాయలు విలువైన పనులు జరుగగా కూలీలకు 17,96,021 రూపాయలు, మెటీరియల్‌కు 9,46,365 రూపాయలు ఖర్చు పెట్టారు.

09ATP27_09ATP27.qxd 17-12-2025 PM 10:38 Page 1



## సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించిన జడ్పిటిసి

అగళి, డిసెంబర్ 17 ప్రభాతవార్త



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన అగళి ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను జడ్పిటిసి ఉమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీయడానికే ఈ సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తనలో దాగి ఉన్న నైపుణ్యాన్ని విజ్ఞాన ప్రదర్శన ద్వారా వెలికి తీయడం కోసం ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎదిగారని, విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసమే ఇలాంటి సదస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎంఈఓ కృష్ణమూర్తిరాజు అన్నారు. ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలకు విద్యార్థులకు గైర్హాజరు క ఆకుండా సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ అన్నారు. ఈ విజ్ఞాన ప్రదర్శనలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి, అక్కడి నుంచి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు, మండలంలోని ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 50శాతం సబ్సిడితో పశువుల దాణా పంపిణీ




పశువుల దాణా పంపిణీ చేస్తున్న ఎంపిపి, జడ్పిటిసి

అగళి, డిసెంబర్ 17 ప్రభాతవార్త

అగళి పశువైద్యశాల వద్ద రైతులకు పశువుల దాణాను ఎంపిపి రేణుకా కామరాజు, జడ్పిటిసి ఉమేష్ పంపిణీ చేశారు. 50 శాతం సబ్సిడితో ఒక్కో రైతుకు ఒక్కో బస్తా ప్రకారం పంపిణీ చేసినట్లు వెటర్నరీ అధికారి శివకుమార్ తెలిపారు. 50 కెజిల బస్తా దాణా 1110 అందులో సబ్సిడి 555లకు దాణా అందజేస్తున్నట్లు ఎంపిపి రేణుకా కామరాజు తెలిపారు. అగళి మండలానికి 100 బస్తాల దాణా సరఫరా అయినట్లు వీటిని రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ తిప్పేస్వామి, ఎంపిటిసి చంద్రప్ప, సందీప్, లింగరాజు, శివన్న, గణేష్, భూతరాజు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప విగ్రహాన్ని వితరణ చేసిన జడ్పిటిసి

అగళి, డిసెంబర్ 17 ప్రభాతవార్త



అయ్యప్పస్వామి విగ్రహాన్ని వితరణ చేస్తున్న జడ్పిటిసి

మండల పరిధిలోని హనుమనపల్లి గ్రామంలో అయ్యప్పస్వామి భక్తులు మాల ధరించిన వారు అయ్యప్పస్వామి పూజలు చేస్తున్నారు. 41 రోజులపాటు అయ్యప్పస్వామి వేషధారణలో స్వామిపై పూజలు నిర్వహిస్తారు. అయ్యప్పస్వామికి అభిషేకాలు, నెయ్యాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. హనుమనపల్లి అయ్యప్పస్వామి భక్త మండలి వారికి అయ్యప్పస్వామి విగ్రహం లేకపోవడంతో జడ్పిటిసి ఉమేష్ బుధవారం అగళి శంకరేశ్వర స్వామి దేవాలయం వద్ద అయ్యప్పస్వాములకు అయ్యప్పస్వామి విగ్రహాన్ని వితరణ చేశారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకుంపికైన వేపులపర్తి విద్యార్థిని



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన నీలాంబరి

బ్రహ్మసముద్రం డిసెంబర్17 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం మండల పరిధిలోని వేపులపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె నీలాంబరి విద్యార్థిని రాష్ట్రస్థాయి కోకోపోటీలకు ఎన్నికకావడం జరిగ్గింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రోషన్ భాష గారు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆ విద్యార్థికి ఫిజికల్ డైరెక్టర్ సచిన్ అభినందనలు తెలియజేయడం జరిగినది అదేవిధంగా భవిష్యత్తులో జాతీయస్థాయి కోకో పోటీలకు ఎన్నిక కావాలని వేపులపర్తి గ్రామానికి, బ్రహ్మసముద్రం మండలానికి పాఠశాలకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించడం జరిగినది

## పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జన్మదిన వేడుకలు

ధర్మవరంటౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త



కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో షర్మిల జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న నాయకులు

ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జన్మదిన వేడుకలను ధర్మవరం నియోజకవర్గ నాయకులు తుంపర్తి పరమేశ్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి షర్మిల జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తుంపర్తిపరమేశ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో నిస్తేజంలో ఉన్నకాంగ్రెస్ పార్టీకి జీవం పోస్తూ ప్రక్షాళన చేస్తూ వారికి అండగా ఉంటూ నాయకులకు, కార్యకర్తలకు మనోధైర్యాన్ని ఇస్తూ ప్రజాసమస్యలపట్ల నిబద్ధతగా, బాధ్యతగా ఉంటూ తండ్రి ఆశయాలకు వారసురాలిగా కాంగ్రెస్ పార్టీకి షర్మిల పునఃజీవం పోశారన్నారు. ఈ కార్యక్రమలో కాంగ్రెస్ పార్టీనాయకులు వెంకటేశ్ యుగంధర్, పెద్దన్న,గంగాదర్, రాము పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థినిలకు ఎంసెట్ మెటీరియల్ పంపిణీ

ధర్మవరంటౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త



ఇంటర్ విద్యార్థినిలకు ఎంసెట్ మెటీరియల్ అందజేస్తున్న కళాశాల అభివృద్ధికమిటిచైర్మన్, ప్రిన్సిపల్ వనితావాణి

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినిలకు ఎంసెట్ మెటీరియల్ ను బుధవారం అందజేశారు. పట్టణానికి చెందిన చేనేత వ్యాపారి బీవీశ్రీనివాసులు రూ.40వేలు విలువ చేసే ఎంసెట్ మెటీరియల్ ను కళాశాలకు సమకూర్చారు. వీటిని బుధవారం కళాశాలలో దాత సోదరుడు బీవీచలపతి, కళాశాల అభివృద్ధికమిటీ చైర్మన్ బండివేణుగోపాల్, ప్రిన్సిపల్ వనితావాణి చేతులమీదుగా 30 మంది విద్యార్థినిలకు ఎంసెట్ మెటీరియల్ ను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పెద్దన్న,వనిత తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తన పంపిణి చేసిన జడ్పిటిసి

బ్రహ్మసముద్రం డిసెంబర్ 17 ప్రభాతవార్త



విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న దృశ్యం

బ్రహ్మ సముద్రం మండలంలో రబి సీజన్ నకు గాను వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం మొదలు కావడం జరిగింది. విత్తనం కావలసిన రైతులు స్థానిక రైతు సేవ కేంద్రంను సంప్రదించి రైతు వివరాలు నమోదు చేసుకొని విత్తనం పొందవలెనని తెలియజేయడం జరిగింది.మండలంనకు రే6 450 క్వింటాల్, గిదిబిళీ50 క్వింటాళ్ల విత్తనం కేటాయించడం జరిగింది. క్వింటాలు ధర రూ. 9200 కాగా 40 శాతం సబ్సిడీతో రైతు వాటా రూ 5520 క్వింటాలు. విస్తీర్ణమును బట్టి అర ఎకరంలోపు ఉన్న రైతులకు ఒక బస్తా, అర ఏకరం నుంచి ఎకరా ఉన్నవారికి రెండు బస్తాలు, ఎకరం పైన విస్తీర్ణం ఉన్న రైతులకు మూడు బస్తాలు ఇవ్వడం జరుగుతుందని. కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జేఎన్వి గోపాల్ తెలియజేయడమైనది. బ్రహ్మ సముద్రం రైతు సేవ కేంద్రం లో సూక్ష్మ పోషకాలు జింక్ సల్ఫేట్( 10 కిలో) 310 బ్యాగులు, బోరాన్ ( 500 గ్రాములు ఒకటి) 100 బ్యాగు లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీగిది ప్రభావతమ్మ , రైతు సంఘం బిలే గౌడ , నాయకులు పరమేష్, ఏ ఈ ఓ నంద కిరణ్, రైతుసేవకేంద్ర సిబ్బంది లిఖిత, సాయిభార్గవ్ పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభం ఏర్పాటు

వజ్రకరూరు డిసెంబర్ 17 ప్రభాతవార్త



స్తంభం ఏర్పాటు పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

మండల కేంద్రం లోని రామిరెడ్డి (శ్రీ లక్ష్మీనారాయణ) స్వామి దేవాలయం ముందు ఉన్న విద్యుత్ స్తంభాన్ని మంగళవారం రాత్రి ట్రాక్టర్ తో ఢీకొన్న విషయం పాఠకులకు తెలిసిందే. బుధవారం విద్యుత్ శాఖ ఏఈ షేక్షావలి ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన విరిగిపోయిన స్తంభాన్ని తొలగించిచారు. నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి, తెగిపడిన విద్యుత్తు లైను సరి చేశారు. మధ్యాహ్న సమయంలోపు విద్యుత్ తిరిగి సరఫరా కావడంతో కాలనీవాసులు విద్యుత్ శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామపంచాయతీ విభజనపై గ్రామసభ



మాట్లాడుతున్న ఎంపీడీవో దృశ్యం

అమరాపురం డిసెంబర్ 17 ప్రభాతవార్త

మండల పరిధిలోని హేమావతి గ్రామపంచాయతీ విభజనపై గ్రామ సభను టూరిజం అతిథి గృహంలో ఎంపీడీవో రామారావు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ తిప్పేస్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అమరాపురం ఎంపీపీ కేంకిర ఈరన్న, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, ఎంపీటీసీ ఓంకార్ స్వామి, గ్రామ కార్యదర్శి



పాల్గొన్న నాయకులు దృశ్యం

నరేష్ బాబు, గ్రామ రెవెన్యూ అధికారి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల విభజనకు ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో ప్రజల మరియు నాయకుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి గ్రామ సభను ఏర్పాటు చేసినట్లు ముఖ్యంగా గ్రామపంచాయతీలో జరిగే అభివృద్ధి , జనాభా, ఓటర్ల సంఖ్య ఆధారంగా విభజన చేపట్టడానికి అవకాశం ఉన్నందున తమ తమ అభిప్రాయాలను రాత మూలకంగా తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, ఎంపీటీసీ ఓంకార్ స్వామి, నాయకుడు గురుమూర్తి, కేంకిరతిప్పేస్వామి, కోరేవు మహాలింగప్ప తదితరులు ప్రసంగించారు. పవిత్ర పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన హేమావతి గ్రామపంచాయతీని ఉమ్మడిగా ఉండే విధంగా కృషి చేయాలని కొందరు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మరికొందరు తమ గ్రామాలకు పరిపాలనపరంగా ఇబ్బందులు నెలకొన్నదృష్ట విభజన చేయాలని కొందరు నాయకులుకోరారు. అయితే అత్యధికంగా విభజన లేకుండా ఉమ్మడి పంచాయతీ గానే కొనసాగించాలని అత్యావసరమైతే తప్ప విభజన చేయాలని అన్ని గ్రామాలు ఏకతాటిపై ఉంటేనే అభివృద్ధి అనే కోణంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయ గ్రామాల నుండి వచ్చిన నాయకుల నుండి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామిరెడ్డి, గురుమూర్తి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ లు నాగరాజు, మంజునాథ్,, కెంకిర తిప్పేస్వామి, శివన్న, కోరేవు మహాలింగప్ప, యువ నాయకుడు కోరేవు గోపి యాదవ్,మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాతమ్మ, దయానంద్, శ్రీరామ్, మహాలింగప్ప, జనసేన అనిల్, రంగస్వామి, హనుమంతరాయ, మహబూబ్ ఖాన్, రంగనాథ్, డీలర్ తిరుమలేష్, గౌడ తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్‌కు ప్రత్యేక హెల్ప్ డెస్క్ సద్వినియోగం చేసుకోండి తహసిల్దార్

బ్రహ్మసముద్రం డిసెంబర్ 17 ప్రభాతవార్త



హెల్ప్ డెస్క్ దృశ్యం

బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో పీజిఆర్ఎస్ కార్యక్రమం కు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు తహసిల్దార్ సుమతి తెలిపారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చే ప్రజలు వారి సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను ఏర్పాటుచేసి మండల స్థాయి డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను ప్రజలు ఇక్కడే పరిష్కరించుకోవాలని ఇక్కడ కానీ ఎడల జిల్లా కార్యాలయానికి వెళ్లాలని అలా చేయకుండా ప్రజలు జిల్లా కార్యాలయం కి వెళ్లడం వల్ల మళ్లీ ఈ కార్యాలయానికి అక్కడి నుంచి సమస్య పంపిస్తున్నందున ప్రజలు సమస్యను ఇక్కడే పరిష్కరించుకోవాలని పత్రికా ప్రకటన ద్వారా పత్రికా ప్రకటన ద్వారా తహసిల్దార్ సుమతి తెలిపారు.

## యూనిఫైడ్ కుటుంబం పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సు దృశ్యం

అమరాపురం డిసెంబర్ 17 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ భవనంలో యూనిఫైడ్ కుటుంబ సర్వే పై అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీవో రామారావు అధ్యక్షతననిర్వహించినారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తాజా కుటుంబ సర్వేను వివరాలు సేకరించడానికి గ్రామ సచివాలయంలో ఉన్న సిబ్బందికి డిసెంబర్ 15వ తేదీ నుంచి దాదాపుగా నెలరోజుల పాటు యూనిఫాడ్ కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. సచివాలయం ఉద్యోగులు ఇంటింటికెళ్ళి ప్రతి వ్యక్తి వివరాలను నమోదు చేసి కుటుంబాల యొక్క పూర్తి వివరాలను సేకరించి నమోదు చేయాలని సచివాలయ సిబ్బందికితెలిపారు. సచివాలయ ఉద్యోగులు సర్వే బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ఆధార్ నెంబర్ మొబైల్ నెంబర్ ఆదాయ ధ్రువీకరణము , ఉపాధి వివరాలను కీలక సమాచారాలను సేకరించి ఇల్లు ఇతర సమాచారాల ను సేకరించి సంక్షిప్తంగా నమోదు చేయాలని, ఈ సందర్భంగాకోరారు ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి ప్రసాద్, పరిపాలన అధికారి ఆరాధ్య, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు వెల్ఫేర్ అసిస్టెంట్లు మరియు మండల్ ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో దివ్యాంగుల సమస్యలపై అవగాహన సదస్సు

ధర్మవరంటౌన్, డిసెంబరు 17 ప్రభాతవార్త



జ్యోతిప్రజ్వలన చేసి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంబిస్తున్న బీజేపీ నేత హరీశ్ బాబు

దివ్యాంగులు సమాజంలో గౌరవంగా, స్వావలంబనతో జీవించేలా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశాబాబు పేర్కొన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం, హక్కులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో పట్టణంలోని ఎన్జీవో హోంలో సక్షమ్ ధర్మవరం శాఖ, శ్రీసత్యసాయి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల సమస్యలపై అవగాహన సదస్సు ను బుధవారం నిర్వహించారు.ఈ సదస్సు ను హరీశ్ బాబు జ్యోతిప్రజ్వలన చేసి సదస్సు ను ప్రారంబించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు సమాజంలో గౌరవంగా జీవించేలా ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్లు, వైద్యసహాయం, ఉపాది అవకాశాలు, గుర్తింపు కార్డులు రవాణా సౌకర్యాలు పూర్తి స్థాయిలో అవగాహనకల్గిఉన్డాలన్నారు.సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందుబాటులో ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమపథకాల ప్రయోజనాలు పొందేలా తాము సహకరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సక్షమ్ ధర్మవరంశాఖ ప్రతినిదులు, దివ్యాంగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శనగ పంటలోని వేరు కుళ్ళు తెగులు పరిశీలన

వజ్రకరూరు డిసెంబర్ 17 ప్రభాతవార్త



రైతుకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు

మండలంలోని గంజికుంట రాగులపాడు రైతు సేవా కేంద్రాల పరిధిలోని శనగ పంటను వ్యవసాయ శాఖ అధికారులు శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ప్రధానంగా వేరు కుళ్ళు తెగులును పరిశీలించారు .కృషి విజ్ఞాన్ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చంద్రాయుడు వేరు కుళ్ళు తెగులు గురించి రైతులకు వివరిస్తూ ఈ తెగులు ప్రధానంగా భూమి నుంచే వ్యాపిస్తుందని దీనికి కారకమైన వైరస్ భూమి భూమి నుండే వ్యాపిస్తుందన్నారు. పిచికారి చేసే మందులకు తట్టుకొని నిరోధక శక్తి ఏర్పరచుకుంటుందన్నారు. పంట మార్పిడి ద్వారా దీన్ని అరికట్ట వచ్చన్నారు. రైతులు రాబోయే సీజన్లలో పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఈ దశలో పంటకు స్కోర్ లేదా లస్టర్ మందులను ఎకరాకు 200మిల్లీలీటర్లచొప్పున పిచికారి చేసుకోవాలని తెలిపారు. రాబోయే సీజన్లో విధిగా శనగపంట వేసుకునే సమయంలో ట్రైకోడెర్మా, ఫ్యూజేరియం మరియు కాపర్ ఆక్సి క్లోరైడ్లతో విత్తన శుద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి మధుకర్, కెవికె కళ్యాణ్ దుర్గం శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్ మల్లికార్జున,రైతులు పాల్గొన్నారు.

## భూ ఒప్పందాల క్రమబద్ధీకరణ పెద్ద మైలురాయి-తహశీల్దార్

రొళ్ల డిసెంబర్ 17 ప్రభాతవార్త:



గ్రామసభ నిర్వహించిన దృశ్యం

దశాబ్దాల నాటి సాదా బైనామా భూ ఒప్పందాల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఒక పెద్ద మైలురాయిని రొళ్ల తాహశీల్దార్ షేక్షావలి అన్నారు. బుధవారం తాసిల్దార్ కార్యాలయంలో బైనామా భూ ఒప్పందాలను క్రమబద్ధీకరించే ప్రక్రియపై రైతులతో గ్రామసభ నిర్వహించారు.ఈ సభలో తాహశీల్దార్ మాట్లాడుతూ..ఈ చర్యతో, చివరకు, గుర్తింపు పొందిన పత్రాలు లేకుండా సంవత్సరాలుగా తమ భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు భూమిపై చట్టబద్ధమైన యజమాని హక్కు కల్పించడం జరుగుతుందన్నారు. చాలా కాలంగా పెండింగ్లో ఉన్న అనధికారిక భూమి లావాదేవీలను న్యాయ వ్యవస్థలోకి తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన కొత్త చొరవలో భాగంగా ఈ చర్య ఒక పెద్ద మైలురాయిని సూచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ గిరియప్ప రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బిజెపి కార్యదర్శులుగా, ప్రేమ్, నూర్‌ల నియామకం

గుత్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త



బిజెపి కార్యదర్శులుగా ఎంపికైన దృశ్యం

భారతీయ జనతా పార్టీ గుత్తి శాఖ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ప్రేమ్ కుమార్, కార్యదర్శిగా నూర్ ఉల్ హాసన్ బాషను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. తమ నియామకాలకు సహకరించిన పట్టణ కన్వీనర్ వెంకప్ప, ఇన్చార్జ్ ప్రతాప్‌రెడ్డిలకు వారు తమ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధి హామీ పథకంలో జాతిపిత పేరు మార్పు ఉన్మాద చర్య..!

-చట్ట సవరణకు వ్యతిరేకంగా 22న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు -వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు బి.కేశవరెడ్డి



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు బి.కేశవరెడ్డి

ఉరవకొండ, డిసెంబరు 17 ప్రభాతవార్త

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాతిపిత పేరు మార్పు ఉన్మాద చర్యకు పాల్పడుతోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెయంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు బి.కేశవరెడ్డి మండిపడ్డారు. పట్టణంలోని ఐదుకల్లు సదాశివన్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పథకం పేరును వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్‌గా మార్చడానికి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడం మహాత్మ గాంధీజీను అవమానించడమే అవుతుందన్నారు. దేశంలో ఏ సమస్యలూ లేనట్లుగా మోదీ ప్రభుత్వం పథకాల పేర్ల మార్పునకు ఉపక్రమించడం సిగ్గు చేటన్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారు ఈ తరహా పేర్లు మార్పువల్ల ఖర్చు తప్ప చేకూరే లాభమేమీ లేదన్నారు. ఉపాధి హామీకు సంబంధించి మంత్రివర్గం ఆమోదించిన సవరణ బిల్లును చూస్తే అది కేవలం పేరు మార్చడానికే ఉద్దేశించినది కాదని ప్రమాదకరమైన మార్పులు చేయనుందని స్పష్టమైందన్నారు. మోదీ ప్రభుత్వానికి స్వాతంత్ర్య సమర యోధుడు, దేశ మాజీ ప్రధానులపై ఎందుకంత కోపమో అర్థం కావడంలేదన్నారు. చట్ట సవరణతో ఉపాధిహామీ ప్రభుత్వ దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుందని ఉపాధిహామీ చట్టం కల్పించిన హక్కు రద్దవుతుందన్నారు. 100 రోజుల పనిదినాన్ని 125 రోజులకు పెంచడం మంచిదే అయినా ఇప్పటివరకు జాతీయస్థాయిలో కుటుంబానికి 100 రోజులు పనిదినాలు గ్యారెంటీగా కల్పించాల్సి ఉండగా సగటున 50 పని దినాలు కూడా కల్పించలేకపోయిందన్నారు. ఉపాధిలేక కూలీలు వలసలు వెళ్లిపోయారని చట్టం ప్రకారం పని లేని రోజుల్లో నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉండగా ఎక్కడా అమలు చేయలేదన్నారు. భూస్వాములు, పెత్తందార్ల ఒత్తిళ్లకు తలొగ్గి చట్టాన్ని నీరుగార్చేందుకు వ్యూహం రచిస్తోందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పకొట్టాల్సిన అవసరం ఉందని కేంద్రం చేపట్టిన ఉపాధి చట్ట సవరణకు వ్యతిరేకంగా ఈనెల 22వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగనున్నాయన్నారు. ఈ సమావేశంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బి.చెన్నరాయుడు, సీపీఐ సీనియర్ నాయకులు గెన్నే మల్లేసి, పురిడి తిప్పయ్య, వజ్రకరూరు మండల కార్యదర్శి దూదేకుల హసీన్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ పకడ్బందీగా నిర్వహించండి

-సమన్వయ సమావేశంలో ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్

ఉరవకొండ, డిసెంబరు 17 ప్రభాతవార్త

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీను పకడ్బందీగా నిర్వహించి లోటుపాట్లను బయట పెట్టాలని ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఉపాధిహామీ పథకం కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీపై వివిధ శాఖలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు 9,52,66,678 రూపాయలు విలువైన 1,289 పనులు జరుగగా కూలీలకు 4,79,90,997 రూపాయలు, మెటీరియల్‌కు 4,72,75,681 రూపాయలు ఖర్చు చేశారన్నారు. రికార్డుల ఆధారంగా పనులను డీఆర్‌పీల ఆధ్వర్యంలో తనిఖీ బృందాలు క్షుణ్ణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో జి.సుజాత, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ నీలకంఠ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్ తదితర శాఖలకు చెందిన సిబ్బంది, టీడీపీ నాయకులు ఎన్.విజయభాస్కర్, కె.జె.కుళ్లాయప్ప, యర్రగుంట్ల వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మకు ఘన సన్మానం

-సన్మానించి జ్ఞాపికను అందించిన ఏడీఏ, ఏవో తదితరులు

ఉరవకొండ, డిసెంబరు 17 ప్రభాతవార్త



జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మను సన్మానించిన దృశ్యం

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మను బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో ఏడీఏ సత్యనారాయణ, ఏవోలు రామకృష్ణుడు, పెన్నయ్య తదితరులు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మకు శాలువాకప్పి పూలమాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఈనెల 31న పదవీ విరమణ చేస్తుండటంతో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి ఎంతో కృషి చేసి రైతులకు ఎప్పటికప్పుడు నూతన సాగు పద్దతులను తెలియజేస్తూ తోడ్పాటునందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో త్రివేణి ఫెర్టిలైజర్స్ యజమాని రాయల్ భీమన్న, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## బావిలో పడిన గుర్తు తెలియని శవం

అగళి డిసెంబర్17 ప్రభాతవార్త

మండల పరిధిలోని ముక్కడంపల్లి చెరువు కట్ట కింద బావిలో గుర్తులు తెలియని పురుషుని శవం పడి ఉంది బూతుని శరీరం వాపు వాపు వచ్చింది సదరు విషయమై ఎస్సై శోభారాణి ఏఎస్ఐలు శ్రీరాములు బషీర్ బావి దగ్గరకు వెళ్లి పరిశీలించారు.



బావిలో పడిన గుర్తు తెలియని శవం

